

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

మాతృభాషలో పట్టు సాధించినప్పుడే మిగతా భాషలపై కూడా పట్టు సాధించే అవకాశం ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ మన మాతభాష గొప్పతనాన్ని గుర్తించి దానిలో ప్రావీణ్యత సాధించాలన్నారు. బి.శ్రీలక్ష్మి, జి.బేబీ మాట్లాడారు.

గర్భిణులకు కాన్పు కష్టాలు

- సర్కారు ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కరువు
- మాతా, శిశు సంరక్షణ మాటలకే పరిమితమా.!
- ప్రైవేటు ఆసుపత్రులకు పంపేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో మాతా, శిశు సంరక్షణ పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం జరగాలన్న సర్కారు లక్ష్యం ప్రహసనంగా మారుతుంది. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా అక్కడ అసౌకర్యాలు స్వాగతం పలుకుతున్నాయి. శస్త్ర చికిత్సలు అవసరమైన వసతులు, రక్త నిల్వలు, బెడ్‌లు సరైన సౌకర్యాలు లేక, వైద్యులు అందుబాటులో ఉండక గర్భిణులు అటువైపు వెళ్లడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వెళుతున్న పలువురు గర్భిణులులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో మాతా, శిశు సంరక్షణ మాటలకే పరిమితమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. పలుచోట్ల సాక్షాత్తు ప్రభుత్వ సిబ్బందే ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంతో పేదలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు కాన్పు కోసం అనేక కష్టాలు పడుతున్నారు. వసతుల లేమితో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మాతా శిశు సంరక్షణను సైతం ప్రభుత్వం ప్రచారానికి వాడుకుంటోంది తప్ప ఆచరణలో ప్రభుత్వాస్పత్రులలో గర్భిణులు, తల్లులకు కావాల్సిన వైద్య సదుపాయాలు, పౌష్టికాహారం సక్రమంగా కల్పించడం లేదు. ఫలితంగా జిల్లాలో మాతా శిశు మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో ఉన్న అన్ని పిహెచ్‌సిలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులలో కంటే ఒక్క కాకినాడ జిజిహెచ్‌లోనే అధికంగా కాన్పులు జరిగాయి.

ప్రైవేటు ఆసుపత్రుల్లోనే శస్త్ర చికిత్సలు

కాకినాడ జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ గణాంకాలను పరిశీలిస్తే ప్రైవేటు ఆసుపత్రులలోనే కాన్పులకు సంబంధించిన శస్త్ర చికిత్సలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ కాలంలో 20,934 కాన్పులు జరగగా వీటిల్లో సాధారణ కాన్పులు 11,558 జరిగాయి. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో 11,909 శస్త్ర చికిత్సలు జరగ్గా ప్రైవేటు ఆసుపత్రుల్లో అధికారుల లెక్కల ప్రకారం 9,025 ఆపరేషన్లు అయ్యాయి. అనధికారకంగా ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. జిల్లాలో 44 పిహెచ్‌సిలు, 10 సిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో లక్ష్యాలకు అనుగుణంగా శస్త్ర చికిత్సలు జరగడం లేదు. అన్ని పిహెచ్‌సిలను 24 గంటల ఆసుపత్రులుగా మార్చినప్పటికీ అరకొర శస్త్ర చికిత్సలు మాత్రమే జరుగుతున్నారు. సౌకర్యాలు లేని పేరుతో కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు దీంతో అనేకమంది పేదలు వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులలో అధిక వసూళ్లు

ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుకి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. సిజేరియన్‌కు రూ.30 వేల నుంచి ఆయా ఆసుపత్రుల పరిస్థితులను బట్టి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రభుత్వాస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రాణ భయంతో అనేక మంది ప్రైవేటును ఆశ్రయిస్తూ అప్పుల పాలవుతున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో గత్యంతరం లేక ఇలా చేయాల్సి వస్తోందంటూ పలువురు వివరించారు.



హైరిస్క్ గర్భిణులు అధికమే

బిసి, సుగర్, థైరాయిడ్ వంటి సమస్యలతో బాటు, 5 అడుగుల కంటే ఎత్తు తక్కువగా ఉన్న వారు గర్భం దాల్చితే వారిని హైరిస్క్ కేసులుగా పరిగణిస్తారు. వీరిని జాగ్రత్తగా పరిశీలించి పరీక్షలు జరపాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు జిల్లా మొత్తంగా 23,116 మంది గర్భిణులు నమోదై ఉండగా 5,765 మంది హైరిస్క్ గర్భిణులు ఉన్నారు. వారికి సరైన వైద్యసేవలు అందిస్తున్నట్లు అధికారిక లెక్కల్లో మాత్రమే చూపుతున్నారు. ప్రతినెలా అన్ని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో వైద్య పరీక్షలు జరుపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రోద్బలంతో వారికి ఆహారం, తాగునీరు ఏర్పాటు చేసుకుంటున్నారు తప్ప ప్రభుత్వ నిధులను ఖర్చు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలుచోట్ల స్కానింగ్ పరీక్షలు సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

కమ్యూనిస్టు ప్రణాళికతో పెను మార్పు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రపంచ మానవ చరిత్రలో కారల్ మార్క్స్, ఎంగిల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక సమాజ పెను మార్పుకు నాంది పలికిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన 'రాజ్యం-విప్లవం' పుస్తకంపై జరిగిన రెడ్ బుక్ డే సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మానవ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర అని అందరూ వివరించారని, కానీ కమ్యూనిస్టు ప్రణాళిక మాత్రం ఈ ప్రపంచాన్ని మార్చాలని ఉద్బోధించిందన్నారు. దీని ప్రేరణతో మనిషిని మనిషి దోపిడీ చేసే విధానానికి ప్రత్యామ్నాయంగా అందరూ సమానమేనన్న సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆటవిక సమాజం, బానిస సమాజం, భూస్వామ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం, సామ్రాజ్యవాద నియంతతృత్వం వంటి అంశాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చిన స్ఫూర్తితో ప్రతి కార్యకర్త దోపిడీకి తావులేని సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్, సిరపరపు శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ, బేబీ, డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, డి.కృష్ణ, స్నేహలత, పద్మ, కరణం గోవిందు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న రాంభూపాల్

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఇవే

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్ మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 26న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రి చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో, ఎఎస్ఆర్ జిల్లాకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, రామచంద్రాపురం విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో, కొత్తపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపునకు ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు

కాకినాడ జిల్లా : కాకినాడ ఎంసి.లారిన్ హైస్కూల్, పెద్దాపురం ఆర్‌డిఓ కార్యాలయం

ఎఎస్ఆర్ జిల్లా: రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా: అమలాపురం అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రాపురంలోని విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పశ్చిమ గోదావరి జిల్లా: భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఓ కార్యాలయాలు

తూర్పు గోదావరి జిల్లా: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

ఏలూరు జిల్లా: ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓ కార్యాలయం

ప్లస్ 2 పాఠశాలలపై హెచ్‌ఎంల వినతి

ప్రజాశక్తి-కాకినాడ

ప్లస్ 2 పాఠశాలలను ఇంటర్మీడియట్ కళాశాలలుగా మార్పు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రధాన ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఆర్‌జెడి నాగమణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కూర్మారావు, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రతి మండలంలో రెండు చొప్పున ప్లస్ 2 పాఠశాలలను ఏర్పాటు చేసిందని, లోపభూయిష్టమైన నిర్వహణ, పుస్తకాలు సరఫరా చేయకపోవడం, ఉపాధ్యాయులను నియమించకపోవడం, వసతులు కల్పించకపోవడం వల్ల ఆ పాఠశాలలలో ప్రవేశాలు ఆశించిన స్థాయిలో లేవన్నారు. ప్లస్ 2 విద్యను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రస్తుతం ఉన్న ప్లస్2 పాఠశాలల నుంచి ఇంటర్ తరగతులను వేరు చేసి అదే కాంపౌండ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి, కాంట్రాక్ట్ లెక్చరర్లను నియమించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. చెవ్వూరి రవి, సాయిమోహన్, శేఖర్, పైడిరాజు, ఏసుదాసు, శ్రీనివాస్, చిన్నారావు సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

క్షయ వ్యాధి నివారణ వారోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి ఎలా వస్తుంది, దాని లక్షణాల గురించి విద్యార్థులకు వివరించారు. రోగికి అందించే పోషకాహారాలు, తదితర అంశాల గురించి వైద్యులు విద్యార్థులకు వివరించారు. సూపర్వైజర్ స్వామి నాథన్, రామారావు, ఎంఎల్‌హెచ్‌పిలు మౌనిక, లక్ష్మి పాల్గొన్నారు.

తుల్యభాగ డ్రెయిన్‌పై క్రాస్ బండ్ ఏర్పాటు

ప్రజాశక్తి - కరప

సాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యల్లో భాగంగా ఎంఎల్ఎ పంతం నానాజీ సూచన మేరకు క్రాస్ బండ్ ఏర్పాటు చేస్తున్నట్లు భోగిరెడ్డి కొండబాబు తెలిపారు. శుక్రవారం భోగిరెడ్డి కొండబాబు క్రాస్ బండ్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. డ్రైనేజీ శాఖ ఎఇ శ్రీకాంతి, ఇరిగేషన్ ఎఇ నాగిరెడ్డి భవాని కరప చివరి పేపకాయలపాలెం మురుగు కాలువ తుల్యభాగ డ్రెన్‌పై నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిర్మాణం చేపట్టడం వల్ల డ్రైనేజీలో ఉన్న నీరు సముద్రంలోకి వెళ్ళిపోకుండా నివారించి ఈ నీరు భీమన్న కర్ర పంట కాలువలోకి మళ్లించడంతో 700 ఎకరాలు వరి పొలాలకు సాగునీరు అందుతుందని, రైతులకు నీటి కొరత ప్రభావం తగ్గుతుందని తెలిపారు.

రాఘవులును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకులు, కార్మికులు, పట్టబద్రుల సమస్యలపై శాసనమండలిలో గొంతెత్తడానికి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఓటర్లను కోరారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు వివిధ గ్రామాల్లోని పట్టభద్రులను ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం బృందాలుగా ఏర్పడి విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై వారి సంక్షేమంపై గత 17 ఏళ్లుగా పిడిఎఫ్‌కు సంబంధించి 16 మంది ఎంఎల్‌సిలు శాసనమండలిలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకను తమ గొంతుగా చేసుకుని మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, స్కీమ్ వర్కర్స్ తరపున ప్రభుత్వాలను నిలదీశారన్నారు. ప్రధానంగా ఉద్యోగుల పక్షాన నిలబడి రావాల్సిన డిఎలు, పిఆర్‌సిలు, సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలోనూ, బయట పోరాటం చేశారని తెలిపారు. నేడు ఉపాధ్యాయునిగా, జెఎసి నాయకునిగా 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై జరిగిన పోరాటాల్లో సేవలందించిన దిడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లో 14వ నెంబర్ లో ఉన్న దిడ్ల వీర రాఘవులు పేరు ఎదురుగా ఉన్న కాలంలో ప్రథమ ప్రాధాన్యతా ఓటుగా 1 నెంబర్ వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు కమిడి సత్య శ్రీనివాస్, వడ్డి ఏడుకొండలు, విప్పర్తి శ్రీనివాస్, చల్లా సంతోష్ కుమార్, చైతన్య శ్రీనివాస్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



నాగభూషణం కుమారిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నాగభూషణకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జగన్నాథపురంలోని కాకినాడ అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకురాలు కాళ్ల నాగభూషణ కుమారి ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు ప్రొసీడింగ్ ఇచ్చి ఆమెను అభినందించారు. అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సువర్చల, కో ఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి, కామర్స్ విభాగాధిపతి ఆర్.శిరీష, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఆమెను ఘనంగా సన్మానించారు.

కార్మికునికి జెడ్‌పిటిసి సాగర్ సాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

కష్టాల్లో ఉన్న కార్మికునికి తాళ్లరేవు జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ అండగా నిలిచారు. తాళ్లరేవు పంచాయితీ రెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రెడ్డి సురేష్ 20 రోజుల క్రితం రెండో అంతస్తు నుంచి కళ్లు తిరిగి బిల్డింగ్ మీద నుంచి కిందకు జారిపడ్డాడు. సురేష్ వెన్నుముక విరిగి, శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. జీవనోపాధి కోల్పోవడంతో కష్టాల్లో ఉన్న ఆ కుటుంబానికి శుక్రవారం జెడ్‌పిటిసి సాగర్ రూ.5,000 నగదు సాయం చేసి ధైర్యం చెప్పారు.

రచనలపై విద్యార్థులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సృజనాత్మక రచనా సాహిత్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలుగు సృజనాత్మక రచనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్, ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ మాతృభాష జాతి ఉనికికి నిదర్శనమని అన్నారు. మాతృభాషలోనే మనసులోని భావాలను అర్థవంతంగా చెప్పగలమన్నారు. సృజనాత్మక రచనల వల్ల మానసిక ఆనందం కలుగుతుందని అన్నారు. ఆదిత్య పూర్వ విద్యార్థి శ్రీకాంత్ విఖ్యాతిగాంచిన సినీ మాటలను రాయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సమయాన్ని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే విజేతలుగా మారుతారని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదిత్య విద్యాసంస్థల పూర్వ విద్యార్థి, ప్రముఖ సినీ రచయిత శ్రీకాంత్ నాయుడు మాట్లాడుతూ 'సృజనాత్మక రచనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, జానపద గేయాలు, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ర్యాలి ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, తెలుగు శాఖాధిపతి టి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.



భాషా దినోత్సవంలో అతిథులను సత్కరిస్తున్న శేషారెడ్డి

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి-కిర్లంపూడి

రైతుకు ఆధార్ తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, సొంత భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రానికి వచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమీత తెలిపారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలోని పలువురు రైతులతో అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. ఈ నెల 25 తేదీ వరకు అవకాశం ఉందని, ప్రతి రైతుకూ 11 అంకెల గుర్తింపు సంఖ్య కార్డును కేటాయిస్తారని, రైతులందరూ త్వరగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలు పొందడానికి అర్హులన్నారు.

రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు


భూ ఆధార్ రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో భూ ఆధార్ రిజిస్ట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులను పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికార అశోక్ మాట్లాడుతూ మండలంలో 14,000 మంది రైతులు నమోదు చేయవలసి ఉందని ఇప్పటివరకు 7500 రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.19.00 లక్షలతో తరగతి గదుల అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిధులు మంజూరు చేశారు. ఈ పనులను ఎపిఇడబ్లుఐడిసి కె.వెంకటరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పనుల్లో, నాణ్యత లోపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని, పది రోజుల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ కుమారి కాంట్రాక్టర్ మరియు సిబ్బంది ఉన్నారు.

కార్టూ'నిజం'



గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 23న నిర్వహిస్తున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో గ్రూప్-2 మెయిన్స్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిమిత్తం కాకినాడ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. 12 మంది లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులు, అధికారులతో సమన్వయం చేసుకొని పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.వెంకటరావు, ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేకాధికారి కె.అప్పలరాజు, డిఐఇఒ జిజికె.నూకరాజు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

24 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ల నీలకంఠం చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు జరగనుండగా దానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, దీక్షధారణతో ఉత్సవాలు ప్రారంభించి రాత్రి 9.05 గంటలకు కళ్యాణం చేపట్టనున్నట్టు చెప్పారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థులు శ్రద్ధగా చదివితే పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ప్రాథమిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి సూచించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక దంటు కళాక్షేత్రంలో భైరవపాలెం, గాడిమొగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల సుమారు 160 మంది పదో తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసం, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్జేడీ నాగమణి పరీక్షలలో విజయం సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలు వివరించారు.

ఎఎస్‌డిలో మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు శాఖ ఆధ్వర్యంలో జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో మాతభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. సాహిత్యం సరైన నిర్ణయం తీసుకుని జీవితాన్ని వద్ధి పథంలో నడిపించుకోవడానికి ఉపకరిస్తుందని, జీవన విధానాన్ని నేర్పిస్తుందని, కొన్ని సందర్భాల్లో క్లిష్ట సమస్యలకు పరిష్కారాలను చూపిస్తుందని తెలిపారు. తెలుగు భాషల్లోని కథలు, పాటలు, కావ్యాలు విశేషాలను ముందు తరాలకు అందించాలన్నారు. రంగరాయ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళ్ళకూరి శైలజ మన భాష మన ఉనికి అనే అంశంపై మాట్లాడారు. స్త్రీల సమస్యలు గ్లోబలైజేషన్ పేరిట సాంస్కృతిక పరాయీకరణను అర్థం చేసుకుని శాంతియుత జీవితం గడపాలంటే సాహిత్యం పాత్ర ఎంతో ఉందని తెలిపారు. డాక్టర్ కృష్ణగాయత్రి, డాక్టర్ శ్యామలాదేవి, డాక్టర్ పి.నాగమల్లిక పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన స్వీయ కవితలు, సామెతలు, కథా విశ్లేషణా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కో ఆర్డినేటర్ వసంత లక్ష్మి, డాక్టర్ లావణ్య, డాక్టర్ సంజోత అరుణ, డాక్టర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శైలజ

నేరాలు ఘోరాలు

ఎటిఎం కార్డు మార్చి రూ.26 వేల చోరీ

ప్రజాశక్తి - పిఠాపురం

ఎటిఎం కార్డును మార్చి ఆకౌంట్ నుంచి రూ26 వేలు చోరీ చేశాడో వ్యక్తి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవపురం గ్రామానికి ఎం.త్రిమూర్తులు గురువారం ఉదయం మాధవపురం సెంటర్‌లో ఎస్‌బిఐ ఎటిఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్ళాడు. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేయమని అడిగాడు. ఆ వ్యక్తి ఎటిఎం కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని వెనకకు తీసి వేరొక ఎటిఎం కార్డు ఇచ్చేశాడు. అది గమనించని త్రిమూర్తులు మళ్లీ ఎటిఎంలో కార్డు పెట్టి పిన్‌ను ఎంటర్ చేయగా ర్యాంగ్ అని వచ్చింది. వెంటనే తన ఖాతా ఉన్న యూనియన్ బ్యాంక్ వెళ్లి వాకబు చేశాడు. ఆ కార్డు తనది కాదని సిబ్బంది ద్వారా తెలుసుకున్నాడు. అప్పటికే త్రిమూర్తులు ఎకౌంట్ నుంచి నాలుగు దఫాలుగా రూ.26 వేలు డ్రా చేసినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

మట్టి లారీల స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో బొండు మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసినట్లు తహశీల్దార్ బియం. ముక్తేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల స్థాయి టాస్క్ ఫోర్స్ నిర్వహించిన సాధారణ తనిఖీల్లో భాగంగా అక్రమంగా బొండు మట్టి తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకొని జరిమానా విధించామని తహశీల్దార్ తెలిపారు. మండల స్థాయిలో ఇసుక, మట్టి, బొండు మట్టిని అక్రమంగా తరలించిన వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు.

స్వయం సహాయక సంఘాల ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీనదయాళ్ జన్ ఆజీవిక యోజన-పట్టణ ఉపాధి పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి స్వయం సహాయక పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ పరిపాలనాదికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.


టివిని అందజేస్తున్న దాత సుబ్బారావు

వికలాంగుల పాఠశాలకు టివి అందజేత

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వికలాంగుల పాఠశాలకు కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన మద్దాల సుబ్బారావు టివిని బహుకరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ టీవిని పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి, దుర్గ, తాతారావు పాల్గొన్నారు.


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న కార్మికులు

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

అధికారుల నిర్లక్ష్యం వల్లే హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ పారిశుధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ కార్మికులపై మున్సిపల్ కమిషనర్ వివక్ష చూపిస్తున్నారన్నారు. 11 నెలలుగా జీతాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంస్థపై తప్పుడు ఫిర్యాదులు మానుకోవాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు సంస్థకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను విద్యాశాఖ అధికారి బి.శ్రీనివాసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 58 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ వారికి పునాదిలాంటిదన్నారు. అభ్యాసనను బలోపేతం చేయటం, పిల్లలు ఆటలు, పాటలు ద్వారా అభ్యాసన చేయడం, తలిదండ్రులకు సమాజం భాగస్వామ్యం, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి నిర్మలకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హిమశ్రీ, ఫాతిమా, ట్రయినీ ఆర్‌పి కృష్ణకాంత్, బాపిరాజు, పాఠశాల జిహెచ్‌ఎం,వీరభద్రం, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

'పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం'

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాష్ట్రంలో వైసిపికి పూర్వం వైభవం తీసుకొద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ నేత శిడగం వెంకటేశ్వరరావు నివాసంలో ముద్రగడ గిరిబాబు నగర వైసిపి కౌన్సిలర్లు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం ద్వారా ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మండలంలోని సి.రాయవరం, రమణయ్యపేటలో గిరిబాబు పర్యటించారు. గిరిబాబు వైసిపి కార్యకర్తలు నాయకులను కలిసి పార్టీని బలోపేతం చేయడానికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కౌన్సిలర్లు బదిరెడ్డి గోవింద్, సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, వాగు బలరాం పాల్గొన్నారు.

కన్నబాబుని కలిసిన ముదునూరి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం కన్నబాబు నివాసంలో కన్నబాబును కలిసి అభినందనలు తెలియజేశారు. మురళి రాజు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉత్తరాంధ్ర జిల్లాలకు రీజనల్ కోఆర్డినేటర్ గా కురసాల కన్నబాబు ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కన్నబాబు మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కన్నబాబు కాకినాడ జిల్లాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసే జిల్లాలో వైసిపి పార్టీకి అన్ని విధాలుగా పార్టీని బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినిలకు ఎస్ఐ వెంకటేష్ శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను ఎవరైనా వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినులపై అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పాటు స్థానిక పోలీసులు కూడా సమాచారం అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంటి వైద్య పరీక్షలను సద్వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

అంధత్వ నివారణ సంస్థ ద్వారా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెసి టి.నిషాంతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సూర్య నగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 425 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపాలు గల 27 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమంలో జెసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ ద్వారా 83,942 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 3,300 మంది దృష్టి లోపాలు గుర్తించారన్నారు. వీరందరికీ ఉచితంగా కళా అద్దాలు పంపిణీ చేస్తారన్నారు.


విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న జెసి టి.నిషాంతి

కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ.హేమలత, డిఐసి మెడికల్ అధికారి డాక్టర్ పి.గీతిక, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయ కుమారి, యుపిహెచ్ వైద్యాధికారి డాక్టర్ శిరీష, తహశీల్దార్ అశోక్ కుమార్, ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షునిగా వీర్రాజు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షునిగా కరుటూరి వీర్రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భం గా వీర్రాజు మాట్లాడుతూ తనకి పదవి వచ్చేందుకు కషి చేసిన పార్టీ ఇన్‌ఛార్జి తోట నరసింహంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. తమపై నమ్మకాన్ని ఉంచి పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీర్రాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఎంఎస్ఎల్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని పౌర సరఫరాల ఎంఎస్ఎల్ పాయింట్‌ను ఆర్‌డిఒ కృష్ణనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎల్ పాయింట్ వద్ద ఉన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ప్రతి బస్తా 50 కేజీలు, గన్నీ బ్యాగు బరువు కాకుండా ఉండాలన్నారు. సాధారణంగా గన్నీ బ్యాగు బరువు 580 గ్రాములు ఉంటుందని తెలిపారు. పరిశీలన సమయంలో కొన్ని బియ్యం బస్తాల బరువు 50 కేజీలు, 49.800 కేజీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎంఎస్ఎల్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకి పంపిణీ చేసే విధానంలో గన్నీ బ్యాగు బరువు కాకుండా 50 కేజీలు ఉండాలని స్పష్టం చేశారు. బఫర్ స్టాక్ గోడౌన్ నుంచి తీసుకుని వచ్చే సందర్భంలో సరి చూసుకునే బాధ్యత ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జిదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్ కుమార్, ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌ఛార్జి డిటి.శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

23న హేవ్‌లాక్ షోకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బౌ.. వావ్ పెట్ షాపీ, స్పా సమర్పణలో ఈ నెల 23న రాజమహేంద్రవరం బ్రీడ్ ఛాంపియన్‌షిప్ సీజన్-2 హేవ్ లాక్ షో(డాగ్, క్యాట్ షో) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తరుణ్ కలీమ్ తెలిపారు. సీజన్-1లో నిర్వహించిన జెఎన్ రోడ్డులోని ఐరన్ హిల్ ఎదురుగా గల దారా గ్రౌండ్స్‌లో 23 మధ్యాహ్నం 4 గంటల నుంచి షో జరుగుతుందని తెలిపారు. డాగ్ షో నిర్వహిస్తున్న దారా గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ వివరాలను వెల్లడించారు. రాజమండ్రి బ్రీడ్ చాంపియన్‌షిప్ సీజన్-1కి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇటీవల చెన్నైలో కెనల్ క్లబ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డాగ్ షోకి హాజరు కాగా రాజమండ్రి బ్రీడ్ చాంపియన్షిప్ అద్భుతంగా నిర్వహించామని అక్కడివారు కితాబు ఇచ్చారని తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని సీజన్-2 మరింత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నామన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా హేవ్ లాక్ బ్రిడ్జి నిలిచిందని, తాము నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు వారధిగా నిలవాలని హేవ్ లాక్ షోగా నామకరణం చేశామన్నారు. ఈ షోలో 50 రకాల డాగ్స్, కేట్ బ్రీడ్‌లు పాల్గొంటాయని తెలిపారు. సీజన్ 1లో ఎపి, తెలంగాణా, ఒడిశాల నుంచి బ్రీడ్‌లు పాల్గొన్నాయని, సీజన్ 2కి కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి కూడా బ్రీడ్‌లు హాజరవుతాయని తెలిపారు. చాంపియన్‌గా నిలిచిన డాగ్‌కు రూ.50 వేల బహుమతి అందజేస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి బ్రీడ్‌లను పెట్ డాగ్ ప్రేమికులు ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న తరుణంలో మన రాష్ట్ర బ్రీడ్ అయిన కొల్లేటి జాగిలం విశిష్టత తెలియజేసే విధంగా కొల్లేటి జాగిలం డాగ్ ప్రత్యేక షో జరుగుతుందన్నారు. పెట్ డాగ్‌లకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నది వాటి యజమానులతో మాట్లాడితే అర్థం అవుతుందన్నారు. ఈ షోకు హాజరయ్యే ప్రతి పెట్ డాగ్‌కి ఎఆర్‌వి వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో కూలర్‌లు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. డాగ్ లకు శిక్షణ ఇవ్వడంపై లైవ్ డెమానిస్ట్రేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీజన్ 1లో ఇచ్చిన హామీ మేరకు 300 స్ట్రీట్ డాగ్స్‌కి స్కిన్ డీసీజస్ రాకుండా ఐవిన్మెట్రిన్ డోస్లు, 50 డాగ్లకు వాక్సినేషన్ చేయించామని, ప్రమాదాలకు గురైన 10 డాగ్లకు ట్రీట్మెంట్ అందించామని వివరించారు ప్రమాదాలకు గురైన డాగ్‌కు చికిత్స అందించడానికి ఎప్పుడూ తమ క్రూ సిద్దంగా ఉంటుందన్నారు. 23న సాయంత్రం 4 నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ షోలో పాల్గొనేవారు మధ్యాహ్నం 2గంటలకల్లా హాజరవ్వాలన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణా కెన్నిల్ క్లబ్ కార్యదర్శి, కెన్నల్ క్లబ్ ఆఫ్ ఇండియా సభ్యులు విశాల్ సుదాన్, జడ్జిలుగా ప్రొఫెషనల్ ట్రైనర్లు టి.సతీష్‌గౌడ, జి.దినేష్‌గౌడ వ్యవహరిస్తారన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో శ్రీను, నాగేంద్ర, నాని, దీపక్, అఖిల్, బాజీ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ప్రదర్శిస్తునన డాగ్‌షో నిర్వాహకులు

ప్రాచీన యుద్ధ కళలను పాడుకోవాలి

వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రాచీన యుద్ధ కళలను సంరక్షించుకోవాలని, వాటి నిర్వాహకులను ప్రోత్సహించినప్పుడే ఈ కళలు నిలుస్తాయని వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మార్షల్ ఆర్ట్స్ ఎపి స్టేట్ ఉషు లీగ్ 2024-25 సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగం పోటీలు స్థానిక జెఎన్ రోడ్‌లో ఉన్న చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో ఉషు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీలకు హాజరయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటూ మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉషు పోటీలు నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు అజ్జరపు వాసుని అభినందించారు. ప్రాచీన కళల్లో ఒకటిగా ఉన్న ఈ క్రీడకు ఒలింపిక్స్‌లో కూడా ప్రాధాన్యత ఉందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించే స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు ఈ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు 250 మంది హాజరయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఫౌండర్, ఆర్గనైజర్ ముత్యాలరావు మాట్లాడుతూ చైనీస్ మార్షల్ ఆర్ట్స్‌కి చెందిన ఈ ఉషు క్రీడకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, నాయకులు సుంకర అంజిబాబు, దాది గౌరీ శంకర్, మార్గాని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గూడూరి, రౌతు

సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రావులపాలెం

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎపిపిఎస్ టిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సైన్స్ క్విజ్ పోటీలలో మండలం విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. 9వతరగతి విభాగం నుంచి గోపాలపురం జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి టి.సుబ్రహ్మణ్యం మొదటి స్థానం సాధించాడు. ఊబలంక ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచింది. 8వ తరగతి విభాగం నుంచి రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కె.తరుణ్ మొదటి స్థానం, రావులపాలెం బాలికల ఉన్నత పాఠశాల ఎ జయశ్రీ రెండవ స్థానం సాధించారు. వీరు 25 జరిగే జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, కోర్స్ సెంటర్ హెచ్ఎం కె.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల నాటి వృక్షానికి నిప్పు

మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని లయన్స్ కళ్యాణ్ మండపం వెనక గల మెయిన్ రోడ్ పై వంద ఏళ్ల నాటి వృక్షానికి నిప్పు అంటుకుంది. చెట్టు చుట్టూ గల చెత్తా గుట్టగా వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు దానికి నిప్పంటించారు. వృక్షానికి నిప్పు అంటుకోవడంతో పొగ మంటలు వ్యాపించాయి. స్థానికులు, మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అది విఫలం కావడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మండపేటకు చెందిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ జై హనుమంతరావు, ఐఎఫ్ కిరణ్ కుమార్, ఫైర్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, డ్రైవర్ తదితరులు మంటలను అదుపుచేశారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పారిశుధ్య పనుల తనిఖీ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ పనుల తనిఖీల్లో భాగంగా కాకినాడ నగరపాలక కమిషనర్ భావన శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. భానుగుడి నుంచి కొండయ్యపాలెం వెళ్లే మిలటరీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రెయిన్ల పరిశుభ్రత, చెత్త సేకరణ ఎలా జరుగుతోంది వంటి విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రైతులు విధిగా రైతు భరోసా కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆమె మండలంలోని సిరిపురంలో రైతు భరోసా కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి ఒక్క రైతూ ఈ నెల 25వ తేదీలోగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకో వాలన్నారు. ప్రతి రైతూ తమ పాస్ పుస్తకం, 1 బి, అడంగల్‌ను నమోదు చేయించుకోవచ్చని తెలిపారు.